జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com


# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 18-1-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 221 పేజీలు: 4 వెల : రూ.7

* కిటకిటలాడిన బస్టాండ్లు
* పండగకు అన్ని ప్రాంతాలకు సర్వీసులు
* ఇబ్బందుల్లేకుండా చూసిన డిపో అధికారులు, సిబ్బంది
* ప్రయాణికులకు సదుపాయాలు కల్పించడంలో సక్సెస్
* పండగ సమయంలో ఆర్టీసీకి పెరిగిన ఆదాయం




# ఆర్టీసీ సేవలు.. భేష్!

**శ్రీకాకుళం, జనవరి 17 (వార్త):** సంక్రాంతిని పురస్కరించుకుని శ్రీకాకుళం జిల్లా ఆర్టీసీ అధికారులు ఉత్తమ సేవలు అందించారు. సుదూర ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాలకు సైతం బస్సు సర్వీసులు వేసి ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చేశారు. పండగను పురస్కరించుకుని హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, విశాఖ, రాజమండ్రి తదితర ప్రాంతాలకు ఉపాధి పనుల నిమిత్తం వెళ్లిన జిల్లావాసులు స్వగ్రామాలకు తరలివచ్చారు. వీరి కోసం జిల్లా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడిపారు. తమతమ స్వగ్రామాలకు వెళ్లేలా బస్సులు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, పలాస తదితర బస్టాండ్లు కిటకిటలాడాయి. అయితే జిల్లా ఆర్టీసీ అధికారులు సమన్వయం చేసుకుని ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఒక ప్రణాళిక ప్రకారం బస్సు సర్వీసులు నడిపి ప్రజల ప్రశంసలు, మన్ననలు అందుకున్నారు. శ్రీకాకుళం ఆర్టీసీ బస్టాండ్‌లో సైతం మౌలిక సదుపాయాలు కల్పించారు. శ్రీకాకుళం-విశాఖ నాన్‌స్టాప్ టిక్కెట్ కౌంటర్లు రద్దీగా మారింది. శ్రీకాకుళం ఆర్టీసీ బీఎంలు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మ, ట్రాఫిక్ సీఐలు రమేష్, గంగరాజు, స్టేషన్ మాస్టార్ ఎంపీ రావు, విజిలెన్స్ సీఐ బలరాం, హెడ్‌గార్డు రామారావు, సిబ్బంది కలిసి ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా పర్యవేక్షించారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా అన్ని చర్యలు చేపట్టారు.




# రథసప్తమి.. పకడ్బందీగా నిర్వహిద్దాం

* ఫిబ్రవరి 2,3,4 తేదీల్లో సాంస్కృతిక కార్యక్రమాలు * కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * రథసప్తమి ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

**శ్రీకాకుళం, జనవరి17 (వార్త):** రథసప్తమి వేడుకలను పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేద్దామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఫిబ్రవరి 2, 3, 4 తేదీలలో నిర్వహించబోయే రథసప్తమి వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి శుక్రవారం జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 27న జిల్లాలోని స్కూల్స్, కళాశాలల్లో సూర్య నమస్కారాలు చేయించాలన్నారు. 2వ తేదీన ఉదయం 8 గంటలకు సూర్య నమస్కారాలు 80 అడుగుల రోడ్డులో ఏర్పాటు చేస్తారని మొబలైజేషన్ ఆయుష్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ జగదీష్ సమీక్షించాలన్నారు. అదే రోజు ఉదయం 10 గంటలకు మున్సిపల్ గ్రౌండ్ లో స్పోర్ట్స్, వాలీబాల్, కబడ్డీ నిర్వహించాలని డిఎస్డీఓను ఆదేశించారు. 80 అడుగుల రోడ్డులో రెండవ రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా పర్యవేక్షించాలని సంప్రదాయం స్కూల్ డైరెక్టర్ స్వాతీ సోమనాథ్‌కు సూచించారు. శోభయాత్రకు పోలీసులతో కో ఆర్డినేషన్ చేయాలని డిఆర్డిఎ పిడిని ఆదేశించారు. 80 అడుగుల రోడ్డులో పార్కింగ్ ఏర్పాట్లపై డీఎస్పీ సీహెచ్ వివేకానంద కలెక్టర్‌కు వివరించారు. ఫుడ్ స్టాల్స్, ప్రజలకు ఉపయోగపడే స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఉద్యానవన శాఖ ఏడీని ఆదేశించారు. 3వ తేదీన లేజర్ షో, క్రేకర్ షో ఉంటాయని, హెలీకాప్టర్ టూరిజం, తదితరమైనవి ఉంటాయని వెల్లడించారు. తాగునీరు, పారిశుధ్యం, తదితర ఏర్పాట్లు పై ఆయన సమీక్షిస్తూ తాగునీరు మున్సిపల్ అధికారులు సరఫరా చేయాలన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి మిల్లు జంక్షన్ వరకే బస్సులు వస్తాయని డిఎస్పీ వివేకానంద కలెక్టర్ కు వివరించారు. మొబైల్ టాయిలెట్ లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, రెవెన్యూ డివిజనల్ అధికారి కె. సాయి ప్రత్యూష, డిఎస్పీ సిహెచ్ వివేకానంద, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్ విజయ సారధి, శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానం ఈఓ బద్రాజి, ఆర్ అండ్ బి ఎస్ఈ జాన్ సుధాకర్, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, డ్వామా పిడి సుధాకర్, మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి బి. శాంతి శ్రీ, సివిల్ సప్లయ్ డిఎం వేణుగోపాల్, డిఎస్ఓ సూర్య ప్రకాష్, గృహ నిర్మాణ శాఖ ఇన్ చార్జ్ పిడి నగేష్, వ్యవసాయ శాఖ జెడి త్రినాధ స్వామి, ఆయుష్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ జగదీష్, సంప్రదాయం డైరెక్టర్ స్వాతి సోమనాథ్, తదితరులు పాల్గొన్నారు.



## కోడిపందెలు స్థావరాలపై పోలీసుల దాడి

**శ్రీకాకుళం క్రైం, జనవరి 17 (వార్త):** లావేరు మండల కేంద్రంలో జరుగుతున్న కోడి పందెల స్థావరాలపై పోలీసులు శుక్ర వారం దాడులు నిర్వహించారు. లావేరు ఎస్ఐ గదుల లక్ష్మణరావుకు సమాచారం రావడంతో సిబ్బంది కలిసి మెరుపు దాడులు చేశారు. కోడిపందెలాలు ఆడుతున్న 13 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మూడు కోడిపుంజులు, రూ.13900 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వీరిని శనివారం కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

## తీరంలో విషాదం

* సముద్రంలో యువకుడి గల్లంతు
* కన్నీరుమున్నీరవుతున్న కుటుంబీకులు



**వజ్రపుకొత్తూరు, జనవరి 17(వార్త):** వజ్రపుకొత్తూరుకు చెందిన జంగం తరుణ్(16) కాశీబుగ్గలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులు కావడంతో శుక్రవారం మిత్రులతో కలిసి వజ్రపుకొత్తూరు సముద్ర తీరానికి వెళ్లాడు. సముద్రంలో దిగి స్నానం చేస్తుండగా అలల ఉధృతికి కొట్టుకుపోయాడు. తోటి స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. గ్రామస్థులు తీరానికి చేరుకుని స్థానిక మత్స్యకారుల సహాయంతో సముద్రంలో గాలించారు. మరోవైపు వజ్రపుకొత్తూరు, భావనపాడు మెరైన్ పోలీసులు కూడా ఘటన స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లతో గాలించినా తరుణ్ ఆచూకీ లభించలేదు. దీంతో తల్లిదండ్రులు హేమంత్, తులసీ కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శివ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. హేమంత్ కూడా ప్రైవేటు ఉద్యోగం చేసి చిన్న కుమారుడు తరుణ్‌ను చదివిస్తున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని వజ్రపుకొత్తూరు ఎస్ఐ బి.నిహార్ తెలిపారు.

## ఉత్తమ ఏపీఎంగా గొడబ ప్రసాదరావు

**వజ్రపుకొత్తూరు, జనవరి 17 (వార్త):** శ్రీకాకుళం డిఆర్‌డిఎ కార్యాలయంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వజ్రపుకొత్తూరు మండలం మహిళా సంఘాల ఉత్పత్తులు సమీకరించి మహిళల జీవనోపాదులను ప్రోత్సహించే విధంగా తయారు చేసిన డ్వాక్రా ఉత్పత్తులకు సిక్కోలు డ్వాక్రా బజారులో అమ్మకాలు జరిపినందుకు గాను ఏపిఎం గొడబ ప్రసాదరావును పీడీ అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఎల్ హెచ్ నారాయణరావు, ఎపిడి సన్యాసి రాజు, ఏసీలు తదితరులు పాల్గొన్నారు.





## ఆదిత్యుని సేవలో జడ్జిలు

**అరసవల్లి, జనవరి 17 (వార్త):** ప్రత్యక్షదైవం, ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామిని శుక్రవారం తెలంగాణకు చెందిన ముగ్గురు హైకోర్టు జడ్జిలు టి.వినోద్ కుమార్, కె.లక్ష్మణ్, జె. శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారిని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్‌శర్మ, డిప్యూటీ కమిషనరు, కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ ఈవో స్వామి వారి ప్రసాదాలను జ్ఞాపికను అందజేశారు.

## ఎమ్మార్పీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, జనవరి17 (వార్త):** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్డిఏ) ఆధ్వర్యంలో ఆహార ప్రాసెసింగ్ రంగం (పి.యం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్) లో ఉద్యోగాల భర్తీకి సీడాప్ ద్వారా శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డిఆర్‌డిఏ పిడి కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో రిసోర్స్ పర్సన్‌గా పనిచేయడానికి మొత్తం 30 ఉద్యోగాలకు గాను అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ప్రోత్సాహకాల ( ఇన్సెంటివ్ ) ఆధారంగా వేతనం ఉంటుందని, ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్, ఆహార ప్రాసెసింగ్ లేదా సహజ వనరుల అభివృద్ధి రంగంలో అనుభవం ఉంటే ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. నవంబర్ 1, 2024 నాటికి 21-30 సంవత్సరాలు వయసు ఉన్నవారు అర్హులని, దరఖాస్తు చేసుకోవడానికి జనవరి 20, 2025 చివరి తేదీగా నిర్ణయించామని, రాత పరీక్ష జనవరి 24న ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ ఫోటోలతో కలిపి జనవరి 20, 2025 లోపు డి ఆర్ డి ఎ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని, లేదు అలాగే పైన చూపిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మరింత సమాచారం కోసం 7989744612, 9912557054 నంబర్లలో సంప్రదించవచ్చు.

## ఏకలవ్య మోడల్ గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం జనవరి 17 (వార్త):** ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయాలలో 6వ తరగతిలో అన్ని సీట్లను నింపడా నికి అర్హులైన బాల బాలికల నుండి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ఒక ప్రకటనను జారీ చేసింది. ఈ మేరకు దరఖాస్తులు 22-01-2025 నుండి 19-02-2025 వరకు స్వీకరిస్తారు. రాత పరీక్ష ఫిబ్రవరి 25గా నిర్ణయించారు. విద్యార్హతలు, విద్యాలయం వారి తరగతిలో గల ఖాళీలు, పరీక్ష కేంద్రాలు, తదితరా వివరాలను గురుకులం వెబ్సైట్‌లో పొందు పరిచారు. సమీపంలో ఏదైనా గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయానికి గాని, జిల్లా గిరిజన ఉప సంచాలకులు/జిల్లా గిరిజన సంక్షే మ అధికారి కార్యాలయంలో వివరాలు తెలుసుకోవచ్చున్నారు.

## ఒడియా బ్రాహ్మణులు సంఘటితం కావాలి

**మందస, జనవరి 17(వార్త):** ఒడియా బ్రాహ్మణులు సంఘటితం కావాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మందస పట్టణంలోని నరసింహస్వామి దేవాలయంలో రాష్ట్ర ఒడియా బ్రాహ్మణ సంఘం వార్షిక ఆంగ్ల క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ పాణిగ్రాహి మాట్లాడుతూ ఒడియా బ్రాహ్మణులు అభివృద్ధికి పాలకులు కృషి చేయాలని కోరారు. టీడీపీ ప్రభుత్వ హయంలో బ్రాహ్మణ కార్పొరేషన్ మళ్లీ పునరావృతం చేసి పేద బ్రాహ్మణులకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దుర్గాప్రసాద్ పాణిగ్రాహి, లీగల్ అడ్వైజర్ లలటేందునాయక్, మందస మండల ఒడియా బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్ పాడి, మండల కార్యదర్శి ప్రదీప్ కుమార్ సాహూ, మందస గ్రామ ఒడియా బ్రాహ్మణ సమాజ్ అధ్యక్షుడు నిర్మల పాణిగ్రాహి, కార్యదర్శి జగదీష్ పండా తదితర గ్రామ బ్రాహ్మణ సభ్యులు పాల్గొన్నారు.



# దివ్యాంగుల్లో సృజనాత్మకత వెలికితీయాలి

☞ వారిని ప్రోత్సహిద్దాం ☞ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి

☞ జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ ☞ విభిన్న ప్రతిభావంతుల నుంచి స్వాభిమాన్ వినతుల స్వీకరణ

**శ్రీకాకుళం, జనవరి 17 (వార్త):** దివ్యాంగులలో సృజనాత్మకత వెలికితీసి వారిని ప్రోత్సహించాలని, వారు ఎందులోనూ తీసిపోరని జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ప్రతీ నెల మూడవ శుక్రవారం స్వాభిమాన్ వినతుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలో వివిధ మండలాల నుంచి వచ్చిన దివ్యాంగుల నుండి జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, జిల్లా పరిషత్ సిఇఓ శ్రీధర్ రాజ్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడి కవితతో కలసి వినతులు స్వీకరించారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్ మెంట్ ఇవ్వాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ముందుగా రిజిస్ట్రేషన్ కౌంటర్ పరిశీలించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పై ఆరాతీసి పలు సూచనలు సలహాలు అందజేసిన అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అందుకొని ఉన్నత లక్ష్యాలను సాధిం చాలి, దివ్యాంగులకు అన్ని విధాలుగా అండగా నిలిచి, ప్రభుత్వ పరంగా చేయూత నివ్వడం జరుగుతుందని, ప్రతీ నెల మూడవ శుక్రవారం



దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ (స్వాభిమాన్) వినతుల స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, దివ్యాంగులు ఎందులోనూ తీసిపోరన్నారు. దివ్యాంగుల పట్ల సానుభూతి, దయ చూపాల్సిన అవసరం లేదన్నారు. వారిలోని సృజనాత్మకత వెలికి తీసి ప్రోత్సహం అందించడం ముఖ్యం అని కలెక్టరు స్పష్టం చేశారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ శ్రీకాకుళం కార్యాలయ అధికారులు, సిబ్బంది దరఖాస్తు అందజేయడానికి వచ్చిన దివ్యాంగులకు రండి కూర్చోండి అని వాళ్లకు కూర్చోబెట్టి త్రాగడానికి మంచి నీళ్లు, టీ, స్నేక్స్ అందజేసారు. స్వాభిమాన్ కార్యక్రమంలొ డిపిఓ కె.భారతీసౌజన్య, జిల్లా ఉపాధి కల్పనాధికారిణి సుధా, గృహ నిర్మాణం సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.నగేష్, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం. సూర్య కిరణ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికుమార్, జిల్లా నలుమూలల నుంచి పలువురు దివ్యాంగులు, బధిరులు తదితరులు పాల్గొన్నారు.

# సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి



● మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ అనిల్

**శ్రీకాకుళం రూరల్, జనవరి 17 (వార్త):** సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలి అని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ అనిల్ వాహనచోదకులకు సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆర్చి జంక్షన్‌లో ప్రత్యేకంగా హెల్మెట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 38 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వాహన చోదకులను ఉద్దేశించి మాట్లాడుతూ రహదారిపై భారీ వాహనాలను నడిపేటప్పుడు ఏకాగ్రత, ఇతర వాహన చోదకుల గమనాలను గమనిస్తూ తద్వారా భద్రతతో కూడిన ప్రయాణ సౌకర్యాన్ని ప్రయాణికులకు కల్పించాలని కోరారు. విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ హెల్మెట్ డ్రైవ్‌లో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శిరీష, సిఐ నాగరాజు, పోలీసు సిబ్బంది , వాహనచోదకులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి యువసేన ఆధ్వర్యంలో ఆటల పోటీలు



**ఎల్ఎన్‌పేట, జనవరి 17 (వార్త):** బొడ్డవలస గ్రామంలో మహాలక్ష్మి యువసేన ఆధ్వర్యంలో ఆటలు పోటీలు నిర్వహించారు. కబడ్డీ, కోకో, ముగ్గులు తదితర పోటీలు విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామానికి చెందిన పల్లి కృష్ణ ఆధ్వర్యంలో వృద్ధులకు, నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహాలక్ష్మి యువసేన సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ పోటీల్లో మందస క్రీడాకారుల ప్రతిభ

**మందస, జనవరి 17(వార్త):** మందస పట్టణానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపారు. సోంపేట మండలంలోని మామిడిపల్లిలో సంక్రాంతి సందర్భంగా బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 40 జట్లు పాల్గొన్నాయి. మందసకు చెందిన క్రీడాకారులు బమ్మిడి వెంకటరమణ(వెంకీ), తెల్లి గణేశ్ తృతీయస్థానం సాధించారు. షీల్డ్‌తో పాటు రూ.1116లు బహుమతి పొందారు.





## పరశురాంపురం జట్టు విజయం

**మెళియాపుట్టి జనవరి17 (వార్త):** పరశురాంపురం గ్రామంలో ప్రీమియర్ పిపిఎల్ 5 లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను సంక్రాంతి సంబరాలలో భాగంగా నిర్వహించారు. మొత్తం 18 జట్లు పాల్గొన్నాయి. శుక్రవారం జరిగిన ఫైనల్స్ మ్యాచ్లో పరశురాంపురం జట్టు విజయం సాధించిందని స్థానిక సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ సందర్భంగా ఈ టోర్నీ నిర్వహించామన్నారు. గడిచిన ఐదు సంవత్సరాలు కాలంగా క్రికెట్ టోర్నీ నిర్వహిస్తునే ఉన్నామని చెప్పారు. విన్నర్స్‌కు బహుమతితో పాటు 10వేలు నగదు, రన్నర్స్‌గా నిలిచిన జట్టుకు బహుమతితో పాటు 8 వేల రూపాయల ప్రైజ్ మనీని అందించామన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సర్పంచ్ తెంబురు ప్రసాద్ రావు, సురేష్ మన్మధ, శాంతారావు, దర్గాకాంత్, రాజు, మోహనరావు, కోటి, అరుణ్, వసంత్, చంటి, మన్మధ, విశ్వనాథ, కళ్యాణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## నేడు ఎన్టీఆర్ 28వ వర్ధంతి

**మందస, జనవరి 17(వార్త):** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, తెలుగు ప్రజల ఆరాధ్యదైవం నందమూరి తారకరామారావు 28వ వర్ధంతి మందస, హరిపురంలో శనివారం నిర్వహిస్తున్నట్టు పార్టీ మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన చెప్పారు. ఉదయం 9గంటలకు హరిపురం, 10గంటలకు మందసలో నివాళులు అర్పిస్తామన్నారు. కార్యక్రమానికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ మందస మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు. పలాసలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో ప్రతీ సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా మెగా రక్తదాన శిబిరం ఈ నెల 22న ఏర్పాటు చేయడం జరిగిందని, శిబిరంలో పాల్గొనదలచిన వారు పేర్లు నమోదు చేయించుకోవాలని, రక్తదాన కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మత్స్యకార కుటుంబాన్ని ఆదుకుంటాం

**శ్రీకాకుళం టౌన్, జనవరి 17 (వార్త):** గార మండలం బందరు వానిపేటలో చేపలువేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందిన గడ్డెయ్య కుటుంబాన్ని ఆదుకుంటామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శనివారం బందరువానిపేటలో గడ్డెయ్య కుటుంబసభ్యులను శంకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా గడ్డెయ్య దహన సంస్కార ఖర్చుల కోసం పది వేలు అందజేశారు.



### మందస వైసీపీ అధ్యక్ష పదవి..

# ఎవరికి వరిస్తుందో?

*** ఆరుగురికి పైగా ఆశావహులు * సామాజిక వర్గాలను లెక్కవేస్తున్న అధిష్టానం * రికమండేషన్ చేయించుకుంటున్న కొందరు *బల ప్రదర్శన చేస్తున్న ఇంకొందరు * నేతల చుట్టూ ప్రదక్షిణలు**

**మందస, జనవరి 17(వార్త):** గత ఎన్నికల్లో ఊహించని రీతిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతాపార్టీల దెబ్బకు వైకాపాకు దిమ్మతిరిగి బొమ్మ కనబడింది. అతి విశ్వాసమే కొంప ముంచిందని కొందరు, ద్వితీయశ్రేణి నాయకులు సక్రమంగా పని చేయలేదని మరి కొందరు లోలోపల చెప్పుకొంటున్నారు. ఏదిఏమైనా.. ఆ పార్టీకి అత్యంత నష్టం కలిగింది. ఈ తరుణంలో పార్టీ ప్రక్షాళనకు అధిష్టానం చర్యలు తీసుకుంటోంది. పాత ముఖాలకు తప్పించి, కొత్తవారిని తీసుకురావడానికి ప్రయత్నాలు మొదలు పెట్టింది. మొదటి నుంచి మందస మండలమే వైకాపాకు గుండెకాయ అని చెప్పుకున్న నాయకులకు ఈ మండలంలో పూర్చలేని నష్టం జరిగింది. బహిరంగంగానే కారణాలు ఉన్నాయి. సామాజిక వర్గాలను సమీకరణ చేయడంతో పార్టీ వైఫల్యం చెందింది. ప్రస్తుతం అన్ని వర్గాలను కలుపుకొనేలా నాయకులను ఎంపిక చేయడానికి కసరత్తు ప్రారంభించింది. ప్రధానంగా పాత నాయకులకు వెనక్కి నెట్టి, కొత్త ముఖాలను తెరపైకి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా మందస మండల అధ్యక్షునిగా ఉన్న అగ్గున్న సూర్యారావుకు జిల్లా కార్యదర్శి పదవిని అప్పగించారు. దీంతో ఆయన పోటీలో లేనట్టేనని తేలిపోయింది. సామాజిక, సీనియర్, ఉద్దాన, మైదాన ప్రాంతాల ప్రాతిపదికన దల్లి జానకిరావురెడ్డి, శానాపతి కిషోర్ కుమార్, సీర ప్రసాద్, దుంపల వైకుంఠరావు, బాడ జగన్నాయకులు, బత్తిని లక్ష్మణ్, మడియా రామకృష్ణ పేర్లు పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. వీరితో పాటు మరో ఇద్దరు, ముగ్గురు తెర వెనుక ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. వీరిలో కొందరు మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వద్దకు వెళ్లి, పదవి కావాలని తమ అనుయాయలతో రికమెండేషన్ కూడా చే(యి)స్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. పదవి ఆశిస్తున్న వారిలో వీరంటే వారు.. వారంటే వీరు గిట్టని వారు ఉన్నారని.. మాకు పదవి రాకపోయినా పరవాలేదు కానీ తనకు పడని వారికి పదవి రాకుండా చేయడానికి శకుని రాజకీయాలు చేస్తున్నట్టు సమాచారం. సత్తువ కోల్పోయిన పార్టీకి జవసత్వాలు కల్పించాల్సిన నాయకులు మధ్య సమన్వయం లేనట్టు కనిపిస్తోంది. పదవులకై పాకులాడుతూ.. వర్గాలుగా ఎవరి శైలిలో వారు రాజకీయాలు నడుపుతున్నారు. ప్రస్తుతం పార్టీకి మందస మండలంలోని బలీయమైన నాయకుడు ఎంతో అవసరం. ఆటుపోట్లను ఎదుర్కొంటూ పార్టీ కేడరు ముందుకు తీసుకెళ్లాలి. ఎన్నికల ముందు ఎవరు ఏమిటో.. అధిష్టానం గుర్తించగలిగింది. పార్టీ ఘోర ఓటమి అనంతరం కొంతమంది ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారు. పైన పటారం.. లోన లొటారం.. అన్నట్టు బయట పార్టీ అని చెప్పుకొంటూ లోలోపల ఎదుటివారితో చక్కగా ఒక్కటైపోతున్నారు.

ఇటువంటి విషయాలను మండల నాయకత్వం గుర్తించి, పరిష్కరించడంలో వైఫల్యం చెందినట్టు సాక్షాత్తూ ఆ పార్టీ నాయకులే చెప్పుకొంటున్నారు. ఈ తరుణంలో పదవులకై నాయకులు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని సీనియర్ నాయకులు చెబుతున్నారు. పార్టీకై శ్రమించిన వారికిగుర్తింపులేదన్న ఆరోపణ కూడా ఉంది. వీటన్నింటి అధిగమించి, అధిష్టానం ఏం నిర్ణయం తీసుకుంటుంది.. ఎవరికి పట్టం కడుతుందో.. మరి కొద్ది రోజుల్లో తేలనుంది. అప్పటి వరకు వేచిచూడాల్సిందే.





## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి

**పలాస, జనవరి 17(వార్త):** పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేనా రామారావు అన్నారు. శుక్రవారం పారిశుధ్యం పనులు పరిశీలించి మూడు రోజులు కూడలిలో కాలువ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం వర్కర్లు పనులపై శ్రద్ధ చూపించాలని, ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాలన్నారు. పట్టణ వాసులు పారిశుధ్య కార్మికులకు సహకారం అందించాలని కోరారు. చెత్తను రోడ్డుపై వేయవద్దని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగం నిషేధమని, వాటిని వినియోగించడం నేరమన్నారు. కాలువల్లో చెత్త వేయడం వల్ల మురుగునీరు ప్రవాహానికి ఇబ్బందులు కలిగి నీరు రోడ్డక్కుతుందన్నారు. ఆయన వెంట శానిటేషన్ సూపర్వైజర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

## కోల్డ్ స్టోరేజీల సామర్థ్యం పెంచుతాం



**పొందూరు, జనవరి 17 (వార్త):** రాష్ట్రంలో గోదాముల సామర్థ్యం పెంచడంతోపాటు కోల్డ్‌స్టోరేజీల నిర్మాణానికి ప్రతి పాదనలు పంపించినట్లు రాష్ట్ర గిడ్డంగులు, గోదాముల సంస్థ ఎండీ గేదెల సురేష్‌కుమార్ చెప్పారు. శుక్రవారం పొందూరులోని స్టేట్ వేర్‌హౌస్ గోదాములు పరిశీలించారు. ఆయన వెంట శ్రీకాకుళం రీజినల్ మేనేజర్ రాజశ్రీ, పొందూరు మేనేజర్ సునీత ఉన్నారు. అలాగే ఆమదాలవలసలో నిత్యావసర సరుకుల గోదాము, కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సంతబొమ్మాళి, జనవరి 17 (వార్త):ఉద్దండపాలెం గ్రామానికి చెందిన చింతాడ శంకరరావు (54) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్ఐ వై.సింహాచలం తెలిపారు. నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## చికిత్స పొందుతూ మృతి

గొల్ల పేటకు చెందిన పాలిన వీరాస్వామి (36) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ వై.సింహాచలం తెలిపారు. మద్యం తాగుతున్నాడని భార్య పార్వతి మందలించడంతో మనస్తాపానికి గురైన పురుగుల మందు తాగాడని, శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

**ఎల్ఎన్‌పేట, జనవరి17 (వార్త):** లక్ష్మీ నర్సుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సందడిగా జరిగింది. ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుని, అప్పట్లో చేసిన అల్లరి చేష్టలు, ఆనంద సమయాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. అలాగే వివిధ పోటీల్లో పాల్గొని సందడి చేశారు. అప్పట్లో తమకు బోధించిన ఉపాధ్యాయులు బులుసు పేరి శాస్త్రి, పైడి మల్లేశ్వరరావు, గుంట ముక్కల కామేశ్వరరావు, ఎంకె మిశ్రో, శరత్ చంద్ర పాణిగ్రాహితో పాటు పలువురు ఉపాధ్యాయులను దుశ్శాలువలు కప్పి పుష్ప గుచ్ఛాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రజా పోరాట యోధుడు వీజీకే మూర్తి



**శ్రీకాకుళం టౌన్, జనవరి 17 (వార్త):** తన యావత్ జీవితాన్ని ప్రజా పోరాటాలకు అంకితం చేసిన యోధుడు కామ్రేడ్ వి.జి.కే.మూర్తి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ బి.తులసీదాస్, పూర్వ శాసనమండలి సభ్యుడు ఎంవీఎస్ శర్మ అన్నారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అధ్యక్షతన కత్తెరవీధిలో జరిగిన కామ్రేడ్ విజికె.మూర్తి సంతాపసభ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూల్లో కడుతున్న భవనాల్లో ఒక హాల్‌కి ఆయన పేరు పెడతామని ప్రకటించారు. కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొన్న సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు నిర్వహించారని మూర్తిని కొనియాడారు. ప్రభుత్వాల నిర్బంధాల సైతం ఎదుర్కొని ప్రజల సమస్యలపై పోరాటాలు చేసిన గొప్ప నాయకుడిని కోల్పోయామని వక్తలు పేర్కొన్నారు. కామ్రేడ్ మూర్తి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి ప్రజాతంత్ర ఉద్యమాలకు తీవ్ర లోటని అన్నారు. సిఐటియు జిల్లా ప్రథమ అధ్యక్షుడిగా, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా, ఉద్యోగ, కార్మిక సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్గా వివిధ సంఘాలకు గౌరవ అధ్యక్షులుగా పని చేశారని కొనియా డారు. గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం అధ్యక్షునిగా సాంస్కృతిక రంగంలో విశేషమైన కృషి చేశారని వారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ 1979 నుండి నేటి వరకు కార్మిక సమస్యలపైన అలుపెర గని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తిని అన్నారు. ఎచ్చెర్లలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని నుండి శ్రీకాకుళం వరకు పాదయాత్ర నిర్వహించడంలో కీలక భూమిక పోషించారన్నారు. సంతాప సభ అనంతరం కత్తెరవీధి నుండి రిమ్స్ వరకు పార్థవదేహాన్ని భారీ ఊరే గింపుగా తీసుకొని వెళ్లి రిమ్స్‌కు దేహదానం చేశారు. ఊరేగింపులో సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణ మూర్తి, ఎన్జీవో సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షులు చౌదరి పురుషోత్తమ నాయుడు తదితరులు పాల్గొన్నారు. సంతాప సభలో వివిధ ప్రజా సంఘాలు నాయకులు పలువురు





మేధావులు ప్రసంగించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజయ్ శర్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి కె.మోహన రావు, జి.సింహాచలం సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్. అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, సాహితీ స్రవంతి కార్యదర్శి కె. శ్రీనివాస్ సిఐటియు నాయకులు కె.నాగమణి, ఎం.ఆదినారా యణమూర్తి. ఎంవి. కామేశ్వర రావు ఆర్.ప్రకాశరావు రెడ్‌క్రాస్ ప్రతినిధి పి. చైతన్య. గాంధీ మందిరం ప్రతినిధి శాస్త్రి, జర్నలిస్టులు వేణు గోపాల్, ఈశ్వరరావు, రచయిత ఆట్టాడ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## బంగారం చోరీపై ఫిర్యాదు

**ఎచ్చెర్ల, జనవరి 17(వార్త):** ఎచ్చెర్ల గ్రామానికి చెందిన పుల్లూరు వెంకటరమణ తన ఇంట్లోని రెండు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని శుక్రవారం పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశాడు. గత ఏడాది నవంబరులో తన ఇంట్లో బీరువాలో దాచిన బంగారు ఆభరణాలను ఈనెల 13న పరిశీలించగా కన్పించడం లేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## మద్యం సీసాలతో ఒకరి అరెస్ట్

ఎచ్చెర్ల మండలంలోని లింగాలపేటకు చెందిన డి. సూర్యనారాయణను ఎనిమిది మద్యం సీసాలతో శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. ముందస్తు సమాచారం మేరకు సూర్యనారాయణ ఇంటి వెనుక భాగంలో పోలీసులు తనిఖీ చేశారు. మద్యం విక్రయిస్తున్న సూర్యనారాయణను పట్టుకున్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సూర్యనారాయణను అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు.



### అర్ధంతరంగా నిలిచిన
## తోటపల్లి కాల్వ లైనింగ్

* పనులు ప్రారంభం ఎప్పుడో?
* రూపు కోల్పోయిన కాలువలు
* ఐదు మండలాలకు అందని సాగునీరు

**వంగర జనవరి 17 (వార్త):** తోటపల్లి పాత బ్యారేజి కుడి ప్రధాన కాల్వ లైనింగ్ పనులు మొదలయ్యేదెప్పుడన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. తోటపల్లి కుడి ప్రధాన కాల్వ లైనింగ్ పనులు రెండేళ్లుగా అర్ధంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ పూర్తియినందున పనులు మొదలు పెట్టటానికి ఇదే సరియైన సమయమైనప్పటకీ పనులు మొదలయ్యే సూచనలు కనిపించటం లేదు. కొత్తగా నిధులు ఈ ప్రాజెక్టు పనులకు కేటాయించటం లేదని తెలిసింది.



గతంలో ఈ లైనింగ్ పనులకు కేటాయించిన నిధులతో సకాలంలో పనులు పూర్తికాక పోవటంతో, ఆ నిధులు వెనక్కి మళ్లినట్లు సమాచారం. దీంతో కుడిప్రధాన లైనింగ్‌పనులు ఇప్పట్లో మొదలయ్యే సూచనలు కనిపించట్లేదు. కుడి ప్రధాన కాల్వ లైనింగ్ పనులు తోటపల్లి కుడి కాల్వకు ముందున్న గరుగుబిల్లి మండలం కొత్తూరు గ్రామం బౌండరీ వరకూ పనులు పూర్తి చేశారు. వంగర మండలంనకు సంబంధించి ప్రధాన,పిల్ల కాల్వలు, స్టెక్చర్లు పనులు కావటం లేదు.దీంతో ప్రదాన,పిల్ల కాల్వలు పూర్తిగా పూడుకు పోయాయి.పిల్ల కాల్వలు అయితే కనిపించనంతంగా గడ్డి, మొక్కలు తదితర వాటితో పూర్తిగా కనిపించననంతగా తయారయ్యాయి. తోటపల్లి కుడి, ఎడమ కాల్వల లైనింగ్ తదితర అభివృద్ధిపనులకు 2018-19 లోనాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో నాటి మంత్రి,నేటి ఎం ఎల్ ఏ కిమిడి కళా వెంకట రావు ఈ తోటపల్లి లైనింగ్ పనుల పనులకు కంకణం కట్టుకున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారికం ఉన్నంత వరకూ తోటపల్లి కుడి ఎడమ కాల్వలు పనులు చకచకా జరిగాయి. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరు వాత గత ఐదేళ్లుగా తోట పల్లి పనులు నత్త నడకగా జరుగుతూ,గత రెండేళ్ల క్రితం పూర్తిగా కాల్వ లైనింగ్ పనులకు ఫుల్‌స్టాప్ పడిందన్న విమర్శలు ఉన్నాయి. 2018-19 లోనాడు టీడీపీ ప్రభుత్వహయాంలో నాటిమంత్రి, నేడు ఎంఎల్ ఎ కిమిడికళావెంకటరావు కృషితో ఈ పనులకు నాడు రూ.193 కోట్లరూపాయలు మంజూరు చేయించటం,వెంటనే పనులు మొదలైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం తోటపల్లి కుడి, ఎడమ ప్రధాన కాల్వల లైనింగ్ పనులుమొదలు కావాలంటే ప్రభుత్వం నుంచి నిధులు సమకూర్చితే తప్ప కాల్వల లైనింగ్ పనుల మొదలు కావన్నది తెలియంది కాదు. కాల్వలు సక్రమంగా లేకపోవటంతో శివారు గ్రామాలకు తోటపల్లి కాల్వలు ద్వారా సాగు నీరు అందని విషయం తెలిసిందే. అదేకాల్వల లైనింగ్ పనులు పూర్తి అయితే పంటపొలాలకు సాగు నీరు సరఫరా కు ఎటువంటి ఆటంకాలు ఉండవని రైతులు తెలిపారు. తోటపల్లి కుడి, ఎడమ కాల్వల ద్వారా ఐదుమండలాల్లో గల సుమారుగా 36 వేల ఎకరాల భూమి సాగు నీరు అందనుంది.సాగు నీరు మొత్తం ఆయకట్టు కు పూర్తి స్థాయిలో నీరు అందాలంటే కాల్వల లైనింగ్ పనులు పూర్తికి, పంటపొలాలకు నీరు సరఫరా నిధుల కోసం రాజాం, పాలకొండ, కురుపాం శాసనసభ్యులు కోండ్రు మురళీమోహన్, నిమ్మక జయకృష్ణ,తోయిక జగదీశ్వ రిలు కృషి చేస్తే తప్ప తోటపల్లి పాత బ్యారేజ్ కుడి, ఎడమ ప్రధానకాల్వల నుంచి గ్రామాలకు నీరు సరఫరా చేసే పిల్ల కాల్వల పూర్తిగా ఇవి కాలువలేనా అన్నంతగా అనుమానం కలుగుతోంది. ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి తోటపల్లి పాత బ్యారేజ్ కుడి, ఎడమ కాల్వలు లైనింగ్, స్టెక్చర్లు తదితర పనులకు నిధులు సమకూర్చటానికి కృషి చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



# బసవన్నలే.. వారి జీవనాధారం

* భైరిసారంగపురం కేంద్రంగా బసవన్నల పెంపకం * పండగొచ్చిందంటే డూడూ బసవన్నల సందడి
* సంక్రాంతికి ఆట, పాటలతో అలరిస్తున్న కళాకారులు



**మందస, జనవరి 17(వార్త):** సంక్రాంతి వచ్చిందంటే డూడూ బసవన్నలు సందడి చేస్తాయి. గంగిరెద్దులను అందంగా అలంకరించి.. వాటి నృత్యాలతో ప్రజలకు ఆనందింపజేస్తారు గంగిరెద్దుల కళాకారులు. మరుగున పడిపోతున్న జానపదాలకు మళ్లీ గుర్తింపు తెచ్చేలా గంగిరెద్దులకు ఎంతో శ్రమించి.. వాటితో నృత్యాలు, చెప్పినదానికి తల ఊపడం, చిన్న స్టూల్పై నిలుచోవడం తదితర విన్యాసాలు చేయించి, జీవన ప్రయాణాన్ని కొనసాగిస్తుంటారు. మందస మండలంలోని భైరిసారంగపురం పేరు చెబితే టక్కున గుర్తుకు వచ్చేది గంగిరెద్దులే.. అనంతరం చదువుకోకపోయినా.. జానపద కళాకారునిగా బాడ సూరన్న ఎంతగానే రాణిస్తున్నారు. దీనిపై 'జాతీయవార్త' అందిస్తున్న ప్రత్యేక కథనం.



ఒకప్పుడు విశాఖపట్నం జిల్లాలోని సింహాచలం, అడవివరం ప్రాంతంలో నివసించే గంగిరెద్దుల కులస్థులు వాస్తవానికి సంచార జీవులు. సుమారు 60 ఏళ్ల క్రితం శ్రీకాకుళం జిల్లాకు కొంతమంది వలస వచ్చి, గుడిసెలు వేసుకుని జీవనం సాగించారు. అప్పటిలో ఎక్కువగా వీరంతా యాచన మీదే ఆధారపడి బతికేవారు. కాలక్రమేణా వీరంతా ప్రస్తుతం కష్టపడడం, ప్రైవేటు ఉద్యోగాలు చేయడం చేస్తున్నారు. ఒకప్పుడు నిరక్ష్యరాస్యులుగా ఉండే ఈ కులంలో ప్రస్తుతం అక్షరాస్యులు కూడా పెరిగారు. మందస మండలంలోని భైరిసారంగపురంలో గంగరెద్దుల జాతుల వారు ఎక్కువగా ఉన్నారు. గ్రామాల్లో భక్తులు సింహాద్రి అప్పన్నను మొక్కుకుని తమ పశు వులశాలలో పుట్టిన దూడలను కానీ కొనుగోలు చేసి కానీ వీరికి అందజేస్తారు. వీటిని బాగా మచ్చిక చేసుకుని, ఎంతో శ్రమించి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. తాము చెప్పినట్లు చేసేలా చేయిస్తారు. తౌడు, ఉలవలు, నువ్వులు, తెలకపిండి, పెసర, మినుముపొట్టు తదితర వాటితో దాణా ఇచ్చి, ముందుగా ఒక సంవత్సరం పాటు ప్రతీ రోజూ శిక్షణిస్తారు. ఈ ఎద్దులను సంక్రాంతి మూడు రోజుల పాటు తమ జాతికి ఆనవాయితీ వస్తున్న ఆచారం ప్రకారం సన్నాయి, డోలు, గంగిరెద్దులను చక్కగా అలంకరంచి, గ్రామాల్లో పర్యటించి, ఇంటింటికి తిరుగుతారు. గ్రామీణులు ఇచ్చే కానుకలను స్వీకరిస్తారు. అదేవిధంగా గంగిరెద్దులతో సర్కస్ ఫీట్లు, విన్యాసాలు చేయిస్తారు.



యజమాని చెప్పిన మాటలకు గంగిరెద్దుల తల ఊపడం.. చిన్న బల్లపై నాలుగు కాళ్లతో నిలబడడం.. తదితర విన్యాసాలు గ్రామీణులు ఆకర్షితులవుతున్నారు. సంక్రాంతికి సొంత ఇళ్లకు చేరుకున్న ప్రజలు ఈ విన్యాసాలను ఎంతో ఆసక్తితో తిలకిస్తారు. అంతేకాకుండా గంగిరెద్దుల వారికి ధాన్యం, బియ్యం, డబ్బును అందిస్తారు. వస్త్రాలు కూడా కొంతమంది సమర్పిస్తారు. మరణించిన తమ పెద్దల ఆత్మలకు శాంతి కలగాలని 'భత్యం' అందిస్తే గంగిరెద్దుల కులస్తులు పెద్దల పేరున పొగుడుతారు. ప్రస్తుతం ఈ కళ దాదాపుగా అంతరించిపోతుందనే చెప్పాలి. తమకు పూర్వీకుల నుంచి ఈ కళ వారసత్వంగా వచ్చిందని చెబుతారు. ఒకప్పుడు కట్టు, బొట్టు, సంప్రదాయాలు, భాష, యాస వేరే విధంగా ఉండేదని, నేడు వీరిలో కొద్దికొద్దిగా మార్పు వస్తోంది. మందస మండలంలోని భైరిసారంగపురంలో ప్రస్తుతం సూరయ్య, పోలయ్య, విశ్వనాథం తదితరులు గంగిరెద్దులతో విన్యాసాలను ఎంతో చక్కగా చేయిస్తున్నారు. జిల్లాలో సుమారు 250 మంది వరకు గంగిరెద్దులను ఆడిస్తూ జీవనం సాగిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో భైరిసారంగపురం, చింతాడ, చిన్నదూగాం, పెంటిభద్ర, జగన్నాథపురం, గుండుబెల్లిపేట, కొన్నానపేట తదితర గ్రామాల్లో ఎక్కువగా ఈ కులస్తులుండగా, పలు గ్రామాల్లో వలస వచ్చిన వీరంతా స్థిరపడుతున్నారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి గంగిరెద్దులతో గ్రామాల్లో తిరిగే వీరంతా ముఠాకు వెళ్లి గంథం అమవాస్య(ఏప్రిల్) సింహాద్రి అప్పన్న ఉత్సవాలు తిరిగి వస్తారు. నాలుగు నెలలపాటు కుటుంబానికి దూరంగా ఉంటూ జీవనం సాగిస్తారు. కార్తీక మాసంలో ఉపమాక, సింహాచలం ఏడు రోజుల యాత్ర సింహాద్రి అప్పన్న దర్శనం చేస్తారు. అంతరించిపోతున్న జానపద కళలను గంగిరెద్దుల కులస్థులు ఇంకా జీవింపజేస్తున్నారడంలో అతిశయోక్తికాదు.


### ఆదరణ తగ్గుతోంది



గంగిరెద్దుల కళను ఆదరణ తగ్గుతోంది. ఏడాది ఆరు నెలలు ఎద్దులకు శిక్షణ ఇస్తాం. ఆరు నెలలు ముఠా(గంగిరెద్దులతో యాచన)కు వెళ్తాం. ఇదే మాకు కులవత్తి. అప్పటిలో సుమారు 120 కుటుంబాలు ఇదే వృత్తితో జీవించేవారం. నేడు 30 కుటుంబాలు మాత్రమే ఈ కళను కొనసాగిస్తున్నాయి. గంగిరెద్దుల కళకు ప్రోత్సాహం కరువవ్వడంతో కూలీకి వెళ్తున్నాం. సంక్రాంతికి ఒడిశావాసులు గంగిరెద్దుల నత్యాలకు ఎక్కువగా ఆదరిస్తారు. అంతేకాదు.. కళాకారులను గౌరవించి, భత్యాన్ని కూడా ఎక్కువగా ఇస్తారు.

**– బాడ సూరన్న. జానపద కళాకారుడు, భైరిసారంగపురం**

### ఇప్పుడిప్పుడే చైతన్యవంతులవుతున్నాం



గంగిరెద్దుల జాతి వెనుకబడిన కులం. ఎన్నో ఏళ్లు గడిచినా నేటివరకు ఒక్క ప్రభుత్వ ఉద్యోగం కూడా పొందలేకపోయాం. మాతంద్రులు, తాతలు నిరక్ష్యరాస్యులు కావడంతో అక్షరాస్యులు తక్కువగా ఉండేవారం. ఇటీవల ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా తాను, పంచిరెడ్డి భాస్కరరావు విలేజ్ సర్వేయర్లుగా మొట్టమొదటి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాం. ఇప్పుడిప్పుడే చైతన్యవంతులవుతున్నాం. కులవత్తితో జీవనం సాగకపోవడంతో ఇతర ఉపాధి, ఉద్యోగాలపై దృష్టి మరల్చాం. కష్టపడి విజయం సాధిస్తున్నాం.

**– అల్లు లోకేశ్వరరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, భైరిసారంగపురం**

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546